క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: వరంగల్‌లోని పలు ప్రాంతాల్లో ఈ నెల 25న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీజీ ఎన్పీడీసీఎల్ వరంగల్ టౌన్ డీఈ ఎస్.మల్లికార్జున్ తెలిపారు. రథం, పెట్రోల్ పంపు, బందల్ శెట్టి, నిజాంపుర, మండిబజార్, జీఆర్ గుట్ట, లక్ష్మీపూర్, గిర్మాజిపేట, కాశిబుగ్గ నుంచి పోచమ్మమైదాన్ రోడ్డు, చార్‌బౌళి, లక్ష్మీపూర్ కూరగాయల మార్కెట్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే, హనుమకొండలోని పలు ప్రాంతాల్లో సోమవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీజీ ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. లష్కర్ బజార్, లష్కర్‌బజార్ మెయిన్ రోడ్డు ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, లష్కర్‌బజార్ మెయిన్ రోడ్డు, సిఖ్ వాడ, కిషన్‌పుర ప్రాంతాల్లో మధ్యాహ్నం 12 గంటల నుంచి 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

మధుకర్‌కు డాక్టరేట్



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని కెమిస్ట్రీ విభాగం పరిశోధకుడు మధుకర్ వైనాలకు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. సింథసిస్ క్యారెక్టరైజేషన్ అండ్ ఇన్వెస్టిగేషన్ ఆఫ్ బయోలాజికల్ యాక్టివిటీ ఆఫ్ షిఫ్ బేస్‌మెటల్ కాంప్లెక్స్ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి మధుకర్‌కు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ రాజేందర్ తెలిపారు. కెమిస్ట్రీ విభాగం ప్రొఫెసర్ జ్యోతి పర్యవేక్షణలో మధుకర్ తన పీహెచ్‌డీ పూర్తిచేశారు.

ఆపరేషన్‌కు ఆర్థిక చేయూత



ఖిలా వరంగల్: వరంగల్ శివనగర్‌కు చెందిన దిడ్డి రమేష్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. ఆపరేషన్ చేయించుకునేందుకు దాతల చేయూత కోసం ఎదురు చేస్తున్నాడు. ఈ క్రమంలో రమేష్‌ను సామాజిక వేత్త మేరుగు అశోక్ ఆదివారం పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. 35వ డివిజన్ పద్మశాలి సంఘం అధ్యక్షుడు గడ్డం రవి, స్థానికులు మాచర్ల కిషన్, కస్తూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

‘శ్వేతార్క’లో పెద్దపట్నం



కాజీపేట: కాజీపేట స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రంలో ఒగ్గు కళాకారులు ఆదివారం పెద్దపట్నం వేసి ప్రత్యేక పూజలు చేశారు. సిద్దిపేట జిల్లా కొమురవెల్లి దేవస్థాన ఒగ్గు పూజారి సింగారపు రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో ఒగ్గు కళాకారులు శ్వేతార్కుడి ఎదుట రంగురంగులతో పెద్దపట్నం వేశారు. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు అయినవోలు వెంకటేశ్వర్లు శర్మ, త్రిగుళ్ల శ్రీనివాస్ శర్మ, ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకులు రాధాకృష్ణ శర్మ, సాయికృష్ణ శర్మ, తుమ్మ శ్రీనివాస్, దేవులపల్లి సదానందం, శనిగరపు రాజ్‌మోహన్, సీనమ్మ తదితరులు పాల్గొన్నారు.

మృతదేహం లభ్యం

వరంగల్ చౌరస్తా: వరంగల్ రైల్వే స్టేషన్ ప్రాంగణంలో ఆదివారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైందని ఇంతేజార్ గంజ్ పోలీసులు తెలిపారు. మృతుడి వయసు 50 - 55 మధ్య ఉంటుందని పేర్కొన్నారు. ఆ మృతదేహాన్ని వరంగల్ ఎంజీఎం మార్చురీ గదికి తరలించినట్లు తెలిపారు. మృతదేహం వివరాలకు 87126 85007, 87126 85118 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

రైలునుంచి జారిపడిన మహిళకు తీవ్ర గాయాలు

ఖిలా వరంగల్: ప్రమాదవశాత్తు రైలునుంచి జారిపడిన ఓ మహిళకు తీవ్ర గాయలయ్యాయి. దాంతో క్షతగాత్రురాలిని 108 వాహనంలో ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటన ఆదివారం సాయంత్రం వరంగల్ న్యూశాయంపేట వద్ద చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం రైలులో 55 ఏళ్ల మంతాజ్ గుంటూరు వెళ్తుండగా న్యూశాయంపేట వద్ద రైలులో నుంచి ప్రమాదవశాత్తు జారిపడిపోయింది. క్షతగాత్రురాలిని 108 అంబులెన్స్ పైలట్ లకావత్ బాలాజీ, ఈఎంటీ చైతన్య ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

గుట్కా ప్యాకెట్ల స్వాధీనం

మడికొండ: నిషేధిత గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు మడికొండ పోలీసులు తెలిపారు. మడికొండ గ్రామానికి చెందిన బుర్ర రమేష్ కిరాణం షాపుపై ఆదివారం దాడి చేసి సుమారు రూ.3,550 విలువైన పొగాకు ఉత్పత్తులను స్వాధీనం చేసుకొని అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజ్‌కుమార్ వివరించారు.

అలంకారప్రాయంగా కమ్యూనిటీ హాల్

- పూర్తిస్థాయిలో వినియోగించుకోని వైనం
- గ్రంథాలయం ఏర్పాటు చేయాలని పెద్దమ్మగడ్డ వాసుల వేడుకోలు



నిరుపయోగంగా ఉన్న కమ్యూనిటీ హాల్



మోటారు బిగించని బోరు

హన్మకొండ చౌరస్తా: లక్షల రూపాయల ప్రజాధనంలో నిర్మించిన భవనం అలంకారప్రాయంగా మిగిలిపోయింది. నిర్వహణ లోపంతో శిథిలావస్థకు చేరుకుంది. పూర్తిస్థాయిలో వినియోగించుకోలేని దుస్థితిలో భవనం ఉండిపోయింది. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి తగు చర్యలు చేపడితే గ్రంథాలయంగా మార్చి వినియోగంలోకి తీసుకురావచ్చని పలువురు అభిప్రాయపడుతున్నారు.

రూ.20 లక్షల వ్యయంతో నిర్మాణం

హనుమకొండ 4వ డివిజన్ పరిధిలోని పెద్దమ్మగడ్డలో 2017లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.20 లక్షల ఎస్‌డీఎఫ్ నిధులతో కమ్యూనిటీ హాల్ భవనానికి శంకుస్థాపన చేసింది. అనంతరం రెండేళ్ల తర్వాత భవన నిర్మాణం పూర్తిచేశారు. కమ్యూనిటీ హాల్‌కు నీటి సౌకర్యార్థం బోరు సైతం వేయించారు. బోరుకు మోటార్ బిగించకపోవడంతో నిరుపయోగంగా మారింది. కమ్యూనిటీ హాల్‌లో సమావేశాలు జరిగినప్పుడు నీటి కోసం ఇబ్బందులు తప్పడం లేదు. అంతేకాకుండా సరైన నిర్వహణ లేకపోవడంతో గోడలు పెచ్చులూడుతున్నాయి.

గ్రంథాలయం ఏర్పాటు చేయాలని..

నెలలో ఒకటి, రెండు సార్లు జరిగే మహిళా సమాఖ్య సమావేశాలకు తప్పితే మిగిలిన రోజులన్నీ కమ్యూనిటీ హాల్ ఖాళీగానే ఉంటోంది. పెద్దమ్మగడ్డలో యువత పెద్ద సంఖ్యలో ఉంటుంది. వారికి ఉపయోగపడేలా కమ్యూనిటీ హాల్‌లో గ్రంథాలయం, కంప్యూటర్లు ఏర్పాటు చేయడం వలన నిరుద్యోగులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

లైబ్రరీ ఏర్పాటు చేయాలి



పెద్దమ్మగడ్డలో లక్షల రూపాయలతో నిర్మించిన కమ్యూనిటీ హాల్ నిరుపయోగంగా ఉంటోంది. ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకుని లైబ్రరీ, కంప్యూటర్లు ఏర్పాటు చేయాలి. తద్వారా స్థానిక నిరుద్యోగులు సమయం వృథా చేయకుండా పోటీ పరీక్షలకు సిద్ధపడుతారు.

- ప్రవీణ్, పెద్దమ్మగడ్డ

సిబ్బందిని నియమించాలి



లక్షల రూపాయలతో నిర్మించిన కమ్యూనిటీ హాల్ నిర్వహణ లోపంతో గోడలు పెచ్చులూడుతున్నాయి. బోరు ఉన్నా మోటారు బిగించకపోవడంతో నీటి సమస్య ఉంది. రోజూ హాల్‌ను శుభ్రం చేయడం, ఇతర నిర్వహణ కోసం స్వీపర్, వాచ్‌మెన్లను నియమిస్తే భవనం పాడవకుండా ఉంటుంది.

- నవీన్, స్థానికుడు

సొసైటీకి భూములు అప్పగించాలి



మాట్లాడుతున్న ఆకుల రాజేందర్

హన్మకొండ అర్బన్: గోపనపల్లిలో భాగ్యనగర్ హౌసింగ్ సొసైటీకి కేటాయించిన భూములను హౌసింగ్ సొసైటీకి వెంటనే అప్పగించాలని టీఎన్జీవోస్ యూనియన్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్ సూచించారు. టీఎన్జీవోలకు ప్రభుత్వం కేటాయించిన భూములు అన్యాక్రాంతం కావడంపై 40 రోజులుగా నిరసన తెలుపుతున్నారు. ఈ క్రమంలో సమ్మెకు ఆకుల రాజేందర్ ఆధ్వర్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లా టీఎన్జీవోస్ అధ్యక్ష, కార్యదర్శులు, జిల్లా నాయకులు ఆదివారం సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఆ భూములను ఉద్యోగులకు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో టీఎన్జీవోస్ హనుమకొండ జిల్లా కార్యదర్శి బైరి సోమయ్య, గౌరవ అధ్యక్షుడు శ్యాంసుందర్, కోశాధికారి రాజేష్, కేంద్ర కార్యవర్గ సభ్యుడు లక్ష్మీప్రసాద్, జనగామ జిల్లా అధ్యక్షుడు ఖాజా షరీఫ్, కార్యదర్శి శ్రీనివాస్, ములుగు అధ్యక్షుడు పోలు రాజు, మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, టీఎన్జీవోస్ నాయకులు పాల్గొన్నారు.

సభకు అనుమతి నిరాకరణ సరికాదు



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మణ్

నయీంనగర్: ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక ఆదివారం తలపెట్టిన బహిరంగ సభకు పోలీసులు అనుమతి నిరాకరించి వేదిక బాధ్యులను అరెస్టు చేయడం ప్రజాస్వామ్య వ్యతిరేక చర్య అని వేదిక కోఆర్డినేటర్ ప్రొఫెసర్ లక్ష్మణ్ విమర్శించారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అక్రమంగా అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్ రెడ్డి పూర్తిగా ప్రజాస్వామ్య, రాజ్యాంగ వ్యతిరేక పరిపాలన సాగిస్తున్నారని ఆరోపించారు. 1996 పెసా చట్టం, 2006 అటవీ హక్కుల చట్టం, 1/70 గ్రామసభ తీర్మానాలను ప్రభుత్వం అమలు చేయాలని సూచించారు. సమావేశంలో వివిధ సంఘాల నాయకులు నున్నా అప్పారావు, ఎన్.నారాయణ రావు, జక్కుల వెంకటయ్య, బాలరాజు, ఆజాద్, కె.శాంత తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం.. ప్రాణదానంలాంటిది



రక్తదాతలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న నిర్వాహకులు

ఖిలా వరంగల్: రక్తదానం.. ప్రాణదానమని బ్రహ్మకుమారి ఫౌండేషన్ వరంగల్ సబ్ జోన్ ఇన్‌చార్జ్ సవిత, కార్పొరేటర్ దిడ్డి కుమారస్వామి, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర పాలక మండలి సభ్యుడు ఈవీ.శ్రీనివాస్‌రావు అన్నారు. బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్యాత్మిక మార్గ దర్శకురాలు ప్రకాశ్‌మణి దాదీజీ 18వ పుణ్యస్మృతి దినోత్సవం సందర్భంగా వరంగల్ 34వ డివిజన్ శివనగర్‌లోని విశ్వశాంతి భవనంలో మెగా రక్తదాన శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో ఆది, సోమవారాల్లో సుమారు లక్ష యూనిట్ల రక్తం సేకరణే లక్ష్యంగా పెట్టుకోగా తొలిరోజు 60వేల యూనిట్ల రక్త సేకరణ చేసినట్లు వివరించారు. సమాజంలో ప్రతీఒక్కరి సహకారంతో ఇలాంటి శిబిరాలు నిర్వహిస్తే తలసేమియా బాధితులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని అన్నారు. అనంతరం రక్తదాతలకు ప్రశంసపత్రాలు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు గణేష్, పొన్న హరినాథ్, బ్రహ్మకుమారీలు విమల, శ్రీదేవి, సుధాకర్, కల్పన, వైష్ణవి, రాణి, సరిత, శ్రీలత, కల్వ నాగరాజు, శశిధర్, శంకర్‌లింగం, సభ్యులు పాల్గొన్నారు.

ముగిసిన ఈశా గ్రామోత్సవం



ఏటూరునాగారం జట్టుతో నిర్వాహకులు

వరంగల్ స్పోర్ట్స్: ఈశా ఫౌండేషన్ ఆధ్వర్యంలో హనుమకొండలోని జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో నిర్వహించిన క్రీడా పోటీలు ఆదివారం సాయంత్రం ముగిశాయి. పురుషులకు వాలీబాల్, మహిళలకు త్రోబాల్ పోటీలను నిర్వహించారు. హోరాహోరీగా సాగిన పోటీల్లో వాలీబాల్ విజేత ఏటూరునాగారం, ద్వితీయ స్థానంలో రాంపూర్, తృతీయ స్థానంలో వాజేడు జట్లు నిలిచాయి. త్రోబాల్ విజేత చెర్లపాలెం, రెండవ స్థానంలో శాయంపేట, మూడో స్థానంలో ఎల్లబెల్లి జట్లు నిలిశాయి. ముగింపు వేడుకలకు డాక్టర్ భగీరథ ముఖ్యఅతిథిగా హాజరై విజేతలకు సర్టిఫికెట్లు, చెక్కులు అందజేశారు.


రైల్వే రన్నింగ్ స్టాఫ్ సంక్షేమానికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న రవీందర్

కాజీపేట రూరల్: రైల్వే రన్నింగ్ స్టాఫ్ లోకోపైలట్లు, అసిస్టెంట్ లోకోపైలట్ల సమస్యల పరిష్కారం కోసం రైల్వే మజ్దూర్ యూనియన్ నిరంతరం కృషి చేస్తోందని సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ సికింద్రాబాద్ డివిజన్ సెక్రటరీ పి.రవీందర్ తెలిపారు. కాజీపేట యూనియన్ యూనిటీ కార్యాలయంలో యూనియన్ ఎల్ఆర్ఎం చైర్మన్ సంగ రమేష్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన కాజీపేట బ్రాంచ్ 2వ బీఈసీ సమావేశంలో యూనియన్ లోకోరన్నింగ్ బ్రాంచ్ సెక్రటరీ పి.సాయికుమార్ మాట్లాడుతూ వరంగల్ సెంట్రలైజ్డ్ కోచింగ్ డిపోను అందరం కలిసి సాధించుకోవాలని సూచించారు. ఇటీవల ఎన్నికైన కాజీపేట ఎల్ఆర్ఎం బ్రాంచ్ ట్రెజరర్ డి.రఘు, అసిస్టెంట్ సెక్రటరీ ఎండి.వలీహైదర్, అసిస్టెంట్ చైర్మన్ పల్లె నరేందర్‌ను బ్రాంచ్ సభ్యులు సన్మానించారు.

నగరంలో ‘రెయిన్‌బో’ సేవలు



రెయిన్‌బో ఆస్పత్రి సేవలు ప్రకటిస్తున్న వైద్యులు

నయీంనగర్: పిడియాట్రిక్ మల్టీస్పెషాలిటీ (శిశు సంరక్షణ), పెరినాటల్ కేర్ (గర్భిణి వైద్యసేవలు) హాస్పిటల్ చైన్‌లో దేశవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన రెయిన్ బో చిల్డ్రన్స్ హాస్పిటల్ వైద్య సేవలను నగరంలో ప్రారంభించింది. ఆదివారం నయీంనగర్‌లో ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో రెయిన్‌బో చిల్డ్రన్స్ మెడికేర్ లిమిటెడ్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ దినేశ్‌కుమార్ చీర్ల, ప్రశాంతి హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ ప్రశాంతి, డాక్టర్ ప్రీతమ్ కుమార్‌రెడ్డి తమ భాగస్వామ్యాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా దినేశ్‌కుమార్ మాట్లాడుతూ విభిన్న ప్రాంతాలకు వైద్య సేవలను విస్తరించడంలో భాగంగా తమ 20వ ఆస్పత్రిని వరంగల్‌లో ప్రారంభించామని తెలిపారు. హనుమకొండలోని బ్రాహ్మణవాడ ప్రశాంతి హాస్పిటల్ వేదికగా సంయుక్త భాగస్వామ్యంతో రెయిన్ బో చిల్డ్రన్స్ హాస్పిటల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. తల్లీబిడ్డలకు అధునాతన వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడానికి నిరంతరం నిబద్ధతతో పనిచేస్తామని వివరించారు.

‘ఆవోపా’ కార్యవర్గ ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం చేసిన కార్యవర్గ సభ్యులు

రామన్నపేట: నగరంలోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ప్రాంగణంలో ఆవోపా కాకతీయ వరంగల్ నూతన కార్యవర్గ సభ్యులు శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆవోపా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మలిపెద్ది శంకర్ హాజరై అవోపా కాకతీయ వరంగల్ నూతన శాఖను ప్రారంభించారు. అధ్యక్షుడు మిత్తింటి శ్రీనివాసులు, అసోసియేట్ అధ్యక్షుడు తాళ్లపల్లి వాసుదేవులు, ప్రధాన కార్యదర్శి కల్లూరి వెంకటేశ్వర్లు, ఆర్థిక కార్యదర్శి పాల సత్యనారాయణ, ఆర్గనైజింగ్ కార్యదర్శి మంచాల విజయ్‌కుమార్, ఉపాధ్యక్షులు, కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. అవోపా రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కందికొండ శ్రీనివాస్, వ్యవస్థాపక కార్యదర్శి కట్టా రవికుమార్, మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు వందనపు శిల్ప, రాష్ట్ర బాధ్యులు గుండా రవీందర్, ఆంజనేయులు, నాగేశ్వరరావు, రవీందర్, హనుమకొండ శాఖ అధ్యక్షుడు ఈశ్వరయ్య, వరంగల్ రైస్ మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు సంపత్‌కుమార్, వరంగల్ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు దుబ్బ శ్రీనివాస్ పాల్గొన్నారు.

కూరగాయల మార్కెట్‌లో మళ్లీ వేలం వెర్రీ

- వినాయక ఉత్సవాల పేరుతో అధిక ధరలతో విక్రయాలకు సన్నాహాలు
- పాల్గొంటే లైసెన్సులు రద్దు చేస్తాం: మార్కెట్ కార్యదర్శి జి.రెడ్డి

వరంగల్ చౌరస్తా: వరంగల్ లక్ష్మీపురం కూరగాయల మార్కెట్‌లో వినాయక చవితి ఉత్సవాల పేరుతో వేలం నిర్వహించేందుకు కమీషన్ ఏజెంట్ల సంఘం నాయకులు ఉవ్విళ్లూరుతున్నారు. ఇంతకాలం మార్కెట్లో మృతుల పేరిట కొంతమంది వేలం పాటలు నిర్వహించి పెద్దఎత్తున నిధులు గోల్‌మాల్ చేశారు. ఇప్పటి వరకు ఆ లెక్కల నిగ్గుతేల్చలేదు. చావులనే కాదు చివరికి దేవుడి ఉత్సవాల సాక్షిగా కూరగాయలు, ఆకుకూరలను అధిక ధరలకు విక్రయించేందుకు చేస్తున్న కుట్రలపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వేలం పాటలు ఏర్పాటు చేయకూడదని గతంలో అప్పటి కలెక్టర్ ఆదేశించారు. అయినప్పటికీ గుట్టుచప్పుడు కాకుండా రూ.6.80 లక్షలకు ఆదివారం వేలం నిర్వహించడంపై పెద్దఎత్తున విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల ఎన్నికైన కమిషన్ ఏజెంట్ల సంఘం ప్రతినిధులు వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా వేలంపాటలు నిర్వహించాలని నిర్ణయించారు. ఈవిషయంపై మాజీ ప్రజాప్రతినిధిని ఓ యువ నాయకుడు, కార్పొరేటర్లు, కమిషన్ ఏజెంట్లు కలిశారు. మార్కెట్‌లో మృతిచెందిన వారి పేరిట వేలంపాటలు నిర్వహించి, ఆ వచ్చిన సొమ్మును వారి కుటుంబ సభ్యులకు అందజేస్తామని చెప్పగా, అందుకు ఆ మాజీ ప్రతినిధులు అంగీకరించినట్లు తెలిసింది. దాంతో మరికొంతమంది వ్యాపారులు, కమిషన్ ఏజెంట్లు ఆయన వద్దకు వెళ్లి గతంలో రూ.కోట్లు వసూలు చేసి ఇప్పటి వరకు లెక్కలు చూపలేదని, మళ్లీ వినాయక చవితి ఉత్సవాల పేరిట వేలం నిర్వహిస్తున్నారని ఫిర్యాదు చేశారు. దాంతో కమిషన్ ఏజెంట్లు, నాయకులను ఆయన మందలించారు. అయినప్పటికీ యువ నాయకుల ఆదేశాలతో కొంతమంది సంఘం నాయకులు గోప్యంగా నోటీసు జారీ చేసి వేలంపాట నిర్వహించారు. దీంతో వ్యాపారులు మళ్లీ ఆ మాజీ ప్రజాప్రతినిధిని కలిసి విషయాన్ని తెలపగా, వేలం పాటలను రద్దు చేయాలని మార్కెట్ కార్యదర్శిని ఆయన ఆదేశించినట్లు సమాచారం. వేలంపాటల వల్ల కొందరి చేతుల్లోనే కూరగాయలు, ఆకుకూరలు ఉండడంతో ఇష్టమెచ్చిన ధరలకు అమ్ముకునే అవకాశం ఉంటుంది. ఈ క్రమంలో ధరలు పెరిగి సామాన్యులు ఇబ్బందులు పడే అవకాశం ఉంది.

లైసెన్సులు రద్దు చేస్తాం..

వరంగల్ లక్ష్మీపురం కూరగాయల మార్కెట్‌లో నిబంధనలకు విరుద్ధంగా వేలంపాటలు నిర్వహించినా, పాల్గొన్నా వారి లైసెన్సులు రద్దు చేస్తాం. రైతులు, వినియోగదారులను ఇబ్బందులకు గురిచేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ నియమ నిబంధనలకు ప్రతిఒక్కరూ కట్టుబడి ఉండాలి.

- జి.రెడ్డి, మార్కెట్ కార్యదర్శి

మట్టి వినాయక విగ్రహాలనే ప్రతిష్ఠించాలి



విగ్రహాల స్టాల్‌ను ప్రారంభిస్తున్న వినయ్ భాస్కర్

హన్మకొండ: వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మట్టి వినాయక విగ్రహాలనే ప్రతిష్ఠించి పూజించాలని బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ సూచించారు. హనుమకొండలోని అంబేడ్కర్ కూడలిలో ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్ సంస్థ నిర్వాహకుడు శివ ఆదివారం ఏర్పాటు చేసిన మట్టి వినాయక విగ్రహాల స్టాల్‌ను వినయ్ భాస్కర్ ప్రారంభించి మాట్లాడారు. ఉత్సవాలను ప్రకృతి, పర్యావరణానికి ప్రాధాన్యతనిస్తూ జరుపుకోవాలన్నారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన విగ్రహాలు, ప్లాస్టిక్ పూలు పర్యావరణానికి హాని కలిగిస్తాయని చెప్పారు. గత కొన్నేళ్లుగా మట్టి వినాయక విగ్రహాలనే ప్రతిష్ఠించేలా ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా విస్తృత ప్రచారం చేశామని వినయ్ భాస్కర్ గుర్తుచేశారు.



రామన్నపేట: మాట్లాడుతున్న రతన్‌సింగ్ ఠాకూర్

మట్టి విగ్రహాలనే పూజిద్దాం

రామన్నపేట: వినాయక చవితి సందర్భంగా మట్టి ప్రతిమలనే పూజిద్దాం.. పర్యావరణ హిత ప్రేమికులమవుదామని పర్యావరణ వేత్త డాక్టర్ రతన్‌సింగ్ ఠాకూర్ అన్నారు. ఏవీవీ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి కోడిమాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ ర్యాలీని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రతన్‌సింగ్ మాట్లాడుతూ పీఓపీ విగ్రహాల వల్ల పర్యావరణంతో పాటు మానవ మనుగడకు ప్రమాదమని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ అధ్యాపకుడు సర్వేశం, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు రబ్బాని, దేవిశ్రీప్రసాద్, సాకేత్, చిరంజీవి, దస్తగిరి, క్రాంతి, భరత్, శివశంకర్, నమ్రత, చందన, ప్రవళిక, తదితరులు పాల్గొన్నారు.

విదేశీ పత్తిపై సుంకాలు విధించాలి



మాట్లాడుతున్న మోర్తాల చందర్‌రావు

ఖిలా వరంగల్: విదేశీ పత్తి దిగుమతులపై కేంద్రం సుంకాలు విధించి, స్థానిక పత్తి రైతులను రక్షించాలని ఎంసీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు మోర్తాల చందర్‌రావు డిమాండ్ చేశారు. వరంగల్ వెంకట్రామ జంక్షన్‌లోని పార్టీ కార్యాలయంలో సింగతి సాంబయ్య అధ్యక్షతన ఆదివారం జరిగిన సమావేశంలో చందర్‌రావు మాట్లాడుతూ ఆగస్టు 15న ఎర్రకోటపై జెండా ఆవిష్కరించిన ప్రధాని మోదీ ప్రసంగిస్తూ రైతుల రక్షణ కోసం అడ్డుగోడగా నిలుస్తానని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. హామీ ఇచ్చి 72 గంటలు గడవక ముందే విదేశీ పత్తి దిగుమతులపై భారత ప్రభుత్వం విధించిన 11 శాతం పన్ను ఈ నెల 20నుంచి సెప్టెంబర్ 30వ తేదీ వరకు ఎత్తివేస్తున్నట్లు భారత ఆర్థిక శాఖ ప్రకటించిందని అన్నారు. ఈ క్రమంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌ను సంతృప్తి పరిచి రైతుకు ప్రధాని ఇచ్చిన విలువెంతో చెప్పకనే చెప్పినట్లు అర్థమైందని ఎద్దేవాచేశారు. విదేశీ పత్తి దిగుమతిపై కేంద్ర ప్రభుత్వం సుంకాలు యధావిధిగా విధించకుంటే దేశ వ్యాప్త ఉద్యమాలను చేపడుతామని చందర్‌రావు హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు పానుగంటి నరసయ్య, మాదం తిరుపతి, గుగులోతు రాజేష్ నాయక్, బల్బుకూరి నరసయ్య, జన్ను ప్రభాకర్, సదయ్య, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

కళాకారుల నిలయం.. ఓరుగల్లు



కాజీపేట అర్బన్: కళాకారుల నిలయంగా ఓరుగల్లు చరిత్రలో నిలిచిపోతుందని ఏతె సతీష్‌కుమార్ అన్నారు. పీఎస్‌పీ రెండో వార్షికోత్సవం సందర్భంగా హంటర్‌రోడ్డులో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సతీష్‌కుమార్ హాజరై మాట్లాడారు. పీఎస్‌పీ సంస్థను పిల్లలమర్రి సతీష్, పుష్పలత స్థాపించి ప్రాచీన కళలు పేరిణి, శివతాండవంతో పాటు కరాటే, యోగా, హిందుస్థాని సంగీతం, వెస్టర్న్ డ్యాన్స్, స్కేటింగ్ వంటి కళల్లో శిక్షణ అందిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారని ప్రశంసించారు. కార్యక్రమంలో వెంపటి శ్రావణి, యాకూబ్, అర్చన, కిరణ్, పాల్, శివ పాల్గొన్నారు.

మున్నూరుకాపు వాణిజ్య విభాగం ఎన్నిక

వరంగల్ చౌరస్తా: మున్నూరుకాపు వాణిజ్య విభాగం 11వ వార్షికోత్సవ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా గజ్జెల రామకృష్ణ, గౌరవ అధ్యక్షుడిగా కంభంపాటి కుమారస్వామి, ఉపాధ్యక్షుడిగా బండి జనార్దన్, ప్రధాన కార్యదర్శిగా శంకేసి శ్రీనివాసమూర్తి, సహాయ కార్యదర్శిగా తోట కర్ణాకర్, కోశాధికారిగా అపరాది సారంగపాణి, ముఖ్య సలహాదారులుగా పుప్పాల యుగంధర్, కొత్త కిషోర్ కుమార్, సామంతుల సాంబయ్య, గై రమేష్‌ను ఎన్నుకున్నారు.

పాపన్నగౌడ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయండి

హన్మకొండ చౌరస్తా: హనుమకొండలో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహం ఏర్పాటుతో పాటు, గౌడ కమ్యూనిటీ హాల్‌కు ఎకరం స్థలం కేటాయించాలని జిల్లా గౌడ జేఏసీ నాయకులు నాయకులు కోరారు. ఈమేరకు బాలసముద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డిని ఆదివారం కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బూర విద్యాసాగర్, బొనగాని యాదగిరి, వడ్లకొండ వేణుగోపాల్, చిర్ర రాజు, గాజర్ల అశోక్, మార్క విజయ్, కక్కెర్ల అనిల్, పొగాకు అశోక్ తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికులకు ఉపయోగపడేలా ఉండాలి

కాజీపేట: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన మద్యం పాలసీ లక్షలాది మంది ఆధారపడి జీవిస్తున్న కల్లుగీత కార్మికులకు మేలు కలిగేలా ఉండాలని కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుర్ర శ్రీనివాస్ అన్నారు. కాజీపేట పట్టణంలో ఆదివారం ఏర్పాటు చేసిన సంఘం విస్తృత స్థాయి సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు గౌని సాంబయ్య, జిల్లా గౌరవ సలహాదారుడు మోడెం రాజేందర్, జిల్లా కమిటీ సభ్యులు నాగపురి రాజయ్య, చిర్ర నర్సింగ్ గౌడ్, పిల్లల సుధాకర్ పాల్గొన్నారు.

సంఘం అభివృద్ధికి పాటుపడాలి

హసన్‌పర్తి: సభ్యులు సంఘం అభివృద్ధికి పాటుపడాలని వినాయక పరపతి సంఘం అధ్యక్షుడు గుడికందుల సురేష్ కోరారు. పరపతి సంఘం 22వ వార్షికోత్సవాన్ని మహబూబాబాద్ జిల్లా గూరుడు మండలంలోని భీముని పాదం వద్ద ఆదివారం నిర్వహించారు. సంఘం ప్రధాన కార్యదర్శి కాలె యాదగిరి, కోశాధికారి నాగుల నాగేందర్, గౌరవ అధ్యక్షుడు ఆరెల్లి వెంకటస్వామి, సాంబయ్య, సంపత్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ప్రజా సమస్యలపై సీపీఎం సర్వే

ఖిలా వరంగల్: వరంగల్ శివనగర్‌లోని 35వ డివిజన్ మైసయ్యనగర్, పుప్పాలగుట్ట, రైల్వేస్టేషన్ కాలనీల్లో సీపీఎం నాయకుడు నాగపురి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ప్రజా సమస్యలపై నాయకులు ఆదివారం ఇంటింటి సర్వే నిర్వహించారు. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా ముంపునకు గురైన ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని నాయకులు గుర్తించారు. వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం లేదని వాపోయారు. యాదగిరి, రమేష్, సాంబరావు, యాకోబు, లక్ష్మి, ఇస్మాయిల్, ఖాదర్ ఖాన్, ఫిరోజ్‌ఖాన్, అన్వర్ పాల్గొన్నారు.

పోచమ్మతల్లికి ఎమ్మెల్యే పూజలు

హన్మకొండ అర్బన్: శ్రావణమాస బోనాలు ముగిసిన సందర్భంగా బాలసముద్రంలోని పోచమ్మతల్లి దేవాలయాన్ని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఆదివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు నిర్వహించిన మహా అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానిక డివిజన్ అధ్యక్షుడు వల్లెపు రమేష్, కార్పొరేటర్ రావుల కోమల, బొంత సుజాత, సారంగపాణి, పల్లపు రాజు, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

బాపూజీనగర్‌లో మెగా వైద్య శిబిరం

కాజీపేట: కాజీపేట 63వ డివిజన్ బాపూజీనగర్ కాలనీలో ఆదివారం మెగా వైద్య శిబిరాన్ని కార్పొరేటర్ విజయశ్రీ ప్రారంభించారు. అల్ఫా ఒమేగా ట్రస్ట్ సహకారంతో ఏర్పాటు చేసిన శిబిరంలో పలువురికి డాక్టర్లు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బిషప్ జాన్ మార్కండేయ, నిఖిల్ జాన్, రోజ్‌మేరీ, డాక్టర్ షఫీ తదితరులు పాల్గొన్నారు.

పోచమ్మ ఆలయ హుండీ లెక్కింపు

మడికొండ: మడికొండ పాత పోలీస్‌స్టేషన్ సమీపంలోని పోచమ్మ తల్లి ఆలయ హుండీని ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం లెక్కించారు. శ్రావణ మాసం సందర్భంగా రూ.55,317 ఆదాయం వచ్చినట్లు వారు వివరించారు. అందులో ఖర్చులుపోను రూ.15,771 మిగిలినట్లు తెలిపారు. అభివృద్ధి కమిటీ సభ్యులు బుర్ర రాజేందర్, కొలిపాక వెంకటస్వామి, నర్మెట భిక్షపతి, బొల్లికొండ వినోద్, మూల అయిలయ్య, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రాజకీయ ఒత్తిళ్లతోనే కార్మికుడి అరెస్ట్

హన్మకొండ: ధర్మస్థలి సంఘటనలో రాజకీయ ఒత్తిళ్లతోనే శానిటరీ కార్మికుడిని అరెస్టు చేశారని ప్రజా సంఘాల నాయకులు అన్నారు. ఈమేరకు హనుమకొండలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద చైతన్య మహిళా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ధర్నా చేశారు. నిరసన కార్యక్రమంలో ఐద్వా, సీపీఐ (ఎంఎల్), న్యూ డెమోక్రసీ, సైంటిఫిక్ స్టడీ ఫోరం, డీఎస్‌ఏ, పీడీఎస్‌యూ, డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్, సీఎల్‌సీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.